**కథ**

# ఆంతర్యాలు

**టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి**

**శాంతమ్మగారు చనిపోయారు.**

**మా కాలనీ చాలా చిన్నది కాబట్టి వార్త చప్పున అందరికీ తెలిసిపోయింది.**

**ప్రక్క ఇంటి సుగుణతో కలసి సుగాత్రి కూడా వెళ్లి చూసి వచ్చేసింది.**

**''ఇంకో అరగంటలో తీసుకెళ్లిపోతారట ఓసారి వెళ్లి చూసిరండి పాపం!'' అంది సుగాత్రి కంట తడితో!**

''నేను టౌన్‌లోకి వెళ్లి పూలహారమైనా తీసుకురావాలి కద? అంత వ్యవధి లేదంటున్నావే?'' అన్నాను.

''మళ్లీ మీరు ఊర్లోకి వెళ్లి రావడం ఎందుకు? మన కాంపౌండ్‌లోనే బోలెడు పూలు పూచాయి. మంచి హారం మేమే కట్టేస్తాము గబగబా!'' అంటూ పూలు కోయడానికి వెళ్లింది సుగాత్రి.

సుగాత్రి కోసిన పూలతో సుగాత్రీ, మా పాప కలసి చక్కని పూలహారం తయారుచేస్తోండగా వచ్చాడు రామం.

''పెద్దామె లిబరేషన్ పుచ్చుకుపోయిందట కదా? ఓసారి వెళ్లి చూసొద్దామా?'' అన్నాడు.

''వార్నీ.. నీవు ఇలాంటి వాటికి కూడా అటెండవుతావా?'' అన్నాను ఆశ్చర్యంగా.

''ఏం నేను మనిషిని కానా?'' అన్నాడు రామం అందంగా నవ్వేస్తూ. రామం నవ్వు చాలా బావుంటుంది.

''సరి సరిలే! కాస్సేపు కూర్చో, మా వాళ్లు పూలు కట్టేస్తున్నారు. తీసుకు వెళ్దాము!'' అన్నాను.

రామం పేపరు అందుకుని కూర్చున్నాడు.

''ఇంతకూ లిబరేషన్ అనేంతటి పెద్ద పదం ఎందుకు ఉపయోగించాల్సి వచ్చింది రామా రఘుకులసోమా?'' అని ప్రశ్నించాను.

''చెప్పినా నీకర్థం కాదులే!'' అన్నాడు రామం పేపర్లోంచీ నా వైపు చూసి మళ్లీ నవ్వేస్తూ.

తనేం మాట్లాడినా ఎదుటి వాళ్లకు కోపం రాకపోవడానికి కారణం ఆ నవ్వే!

హారం తయారయ్యాక దాన్ని తీసుకుని ఇద్దరం బయల్దేరాము.

వరండాలో మంచంమీద నిద్రపోతున్నట్లే ఉన్నారు కాంతమ్మగారు.

పూలహారం వేసి వచ్చాక మెట్లమీద కూర్చుని ఉన్న శంకరాన్ని అడిగాను ఎలా జరిగిందని!

''ఉదయాన్నే నాకూ శారదకూ కాఫీ కూడా పెట్టిచ్చారు. నేను కాఫీ త్రాగేసి పేపరు చూసుకుంటున్నాను. శారద ప్రక్క ఇంటి పిన్నిగారితో మాట్లాడుతోంది ఆ గోడ దగ్గర. 'శంకరం' అని గట్టిగా పిలిచారు కంగారుగా వంట గదిలోంచి. నేను గబగబా లోనికి వెళ్లాను. శారద కూడా నా వెనుకే వచ్చేసింది. గుండెలో చాలా నొప్పిగా ఉందన్నారు. నడవలేకపోతోంటే నెమ్మదిగా నడిపించుకు వచ్చి పడుకోబెట్టాము. నేను వెళ్లి డాక్టర్ని తీసుకువచ్చేలోపే...''

ఆపై చెప్పలేకపోయాడు శంకరం.

నాలుగు సానుభూతి వాక్యాలు చెప్పి కాస్సేపుండి బయల్దేరాము.

''శంకరం చాలా బాధపడుతున్నట్లున్నాడు!'' అన్నాను దార్లో.

''బాధ పడ్తున్నట్లుండడం కాదు నిజంగానే చాలా బాధపడుతున్నాడు. అనేక ఆలోచనలతో కూడా!'' అన్నాడు.

''కడుపున పుట్టిన బిడ్డల కన్నా ఎక్కువగా చూసుకుంది వాళ్లని ఆవిడ. పాపం శంకరం వాళ్లకు ఇబ్బందే ఇకపై!'' అన్నాను.

''ఇబ్బంది ఎన్నో రోజులుండదులే!''

''అదేమిటి?''

''వారం తిరగకమునుపే ఇంకో ముసలావిడను వెతికి తెచ్చుకోరూ?'' అన్నాడు రామం నవ్వి.

రామం మాటలకు ముక్కూ మొహమూ ఉండవు ఎప్పుడూనూ. ఏం మాట్లాడుతాడో తనకే తెలియదనిపిస్తుంటుంది నాకు మాత్రం.

''పెద్దామె జ్ఞాపకాలను అంత తేలికగా మరచిపోగలరంటావా?'' అన్నాను కోపంగా.

''జ్ఞాపకాలూ, స్పందనలూ అన్నీ నీలాంటి వాళ్లకు. వాళ్లకవేమీ ఉండవు!'' అన్నాడు రామం.

రామం నవ్వుతున్నా కూడా నాకు ఒళ్లు మండింది. ఇంకేం అనలేక మిన్నకుండిపోయాను.

రామం వాళ్ల వీధి మలుపు తిరిగి వెళ్లిపోగానే నేను పెద్దామెను గూర్చి ఆలోచిస్తూ మా వీధికేసి అడుగులేశాను.

★ ★ ★

పెద్దామె స్వంత ఊరు శంకరాపురం. ఆమె భర్త ఎలిమెంటరీ స్కూలు టీచరుగా పనిచేసి రిటైరయ్యారు. పిల్లలు లేకపోవడం వల్ల ఆయన పోయాక చాలా ఒంటరితనం అనుభవించారు ఆవిడ.

శారదకు చాలా దూరపు బంధువు శాంతమ్మగారు. శంకరాపురంలో ఒంటరిగా జీవిస్తున్న శాంతమ్మగారిని పెద్ద దిక్కు లేని తమకు పెద్దగా ఉండంటూ బ్రతిమాలి తెచ్చుకున్నారు శంకరం, శారదలు.

పెద్దామె వారిల్లు చేరాక పిల్లలు లేని లోటు ఆమెకు తీరింది. పెద్ద దిక్కు లేని కొరత వారికీ తీరింది. శంకరానికీ, శారదకూ, పిల్లలకూ ఎవరికి కావాల్సిన విధంగా వారికి తనే వండి వార్చేది పెద్దామె. పాత కాలం మనిషవ్వడం వల్ల పనిమనుషుల తీరు నచ్చేది కాదామెకు. అందుకే ప్రతి పనీ తనే చేసుకుపోతుండేది.

పిల్లలకూ, ఆవిడకూ మంచి అటాచ్‌మెంట్ ఏర్పడిపోయింది.

దాదాపు ఆరు సంవత్సరాలపాటు మా కాలనీకే ఓ వెలుగులా ఉండిపోయింది పెద్దామె. కాలనీలోని ఆడవాళ్లందరికీ ఆవిడ మీద అభిమానం.

హఠాత్తుగా ఆవిడ పోవడం పరాయివాళ్లమైన మాకే ఎంతో బాధాకరంగా ఉంటే శంకరం, శారదల పరిస్థితి ఎలా ఉంటుందో అనుకుంటూ ఇల్లు చేరాను.

★ ★ ★

అర్థం లేకుండా మాట్లాడినా రామం మాటల్లో వాస్తవాలు వెలుగుచూస్తుంటాయి ఒక్కోసారి.

''వారం తిరగక మునుపే ఇంకో ముసలావిడను వెతికి తెచ్చుకోరూ!'' అంటూ అతనన్న మాటల్లోని వాస్తవం మరీ వారానికే కాకపోయినా పదిహేను రోజుల తరువాత శంకరం ద్వారానే తెలియవచ్చింది.

పెద్దామెను కోల్పయిన దుఃఖం నుండీ కాస్త తేరుకున్నారేమో శంకరం బాగా హుషారుగానే కన్పించాడు మా ఇంటికి వచ్చినప్పుడు.

మంచినీళ్లు, కాఫీ లాంటి కామన్ మర్యాదల తరువాత తను వచ్చిన విషయం నెమ్మదిగా విప్పదీశాడు.


''మీ బంధువులలో ఎవ్వరైనా ఎవరూ లేని పెద్ద దిక్కుంటే చెప్పి పుణ్యం కట్టుకోండి! తెచ్చి మా ఇంట్లో పెట్టుకుని పోషిస్తాము. మాకూ, మా పిల్ల

లకూ తోడుగా ఉండిపోతారు!'' అంటూ.

నేను అవాక్కయిపోయాను కొన్ని నిముషాల పాటు.

''జ్ఞాపకాలూ, స్పందనలూ అన్నీ నీలాంటి వాళ్లకు. వాళ్లకవేమీ ఉండవు!'' అన్న రామం మాటలు చెవులలో మెదిలాయి.

నా ఆలోచనలెలా ఉన్నా సుగాత్రి మాత్రం శంకరం మాటల్ని మన్నించిందనే చెప్పవచ్చు. తన తరఫు వాళ్లలో దిక్కూ, మొక్కూ లేని వాళ్లెవరున్నారా అని ఆరా తీయడం మొదలుపెట్టింది.



సుగాత్రి ఇన్వెస్టిగేషన్‌లో తన తరఫు వాళ్లెవరూ దొరక్కపోవడంతో నా తరఫు దాయాదుల లోంచీ జానకత్తయ్యను సెలెక్ట్ చేసేసింది.

ఒకప్పుడు బాగా బ్రతికిన వాళ్లే జానకత్తయ్య వాళ్లు. మామయ్య వ్యసనాలకు అలవాటు పడిపోవడం వల్ల ఆడవాళ్ల కోసమూ, పేకాటకూ, త్రాగుడుకూ ఆస్తులన్నీ చాలావరకూ తగలేశాక తనూ తన పనయిపోయినట్లుగా వెళ్లిపోయాడు.

ఆయన్ను తగలేశాక మూడు నెలలు తిరగక మునుపే మిగిలి ఉన్న పొలం, ఇల్లూ తెగనమ్మి ఏకైక కుమార్తె పెళ్లి చేసేసింది జానకత్తయ్య. ఆపై దిగులుతో జబ్బు పడి వాల్మీకిపురంలో ఓ చిన్న అద్దె ఇంట్లో చాలా పేదరికంతో కాలం గడుపుతున్న అత్తయ్యకు నేనూ ప్రతీ నెలా సుగాత్రికి తెలిసి కొంతా, తెలియక కొంతా ఆర్థిక సాయం అందిస్తుంటాను నా శక్తికొద్దీ.

నిజానికి జానకత్తయ్య లాంటి వాళ్లకే శంకరం లాంటి వాళ్ల నీడ అత్యవసరం.

కానీ నేను జానకత్తయ్యను తమ ఇంటికి తీసుకోమని శంకరంతో చెప్పడానికి నామోషీ పడ్డాను. అయితే సుగాత్రి ఊరుకో లేదు.

''మనలాంటి వారి దయాదాక్షిణ్యాల మీద ఆమె బ్రతుకు వెళ్లదీస్తోంది కదా? దానికన్నా శంకరం వాళ్లింట్లో వాళ్లకు పెద్ద దిక్కుగా ఉండిపోవడం నయం కదా? ఆమెకూ ఓ భద్రత ఉంటుంది. వాళ్లకూ ఓ పెద్ద దిక్కుంటుంది. వారు కోరుకుంటున్నట్లుగానే వారి కుటుంబంలో ఓ స్వంత మనిషైపోగలదు!'' అంటూ ప్రోత్సహించింది సుగాత్రి.

దాంతో జానకత్తయ్యకు అందివచ్చిన ఓ మంచి అవకాశాన్ని నేను దూరం చేస్తున్నానేమో? అనే భావన నాలో కలుగసాగింది.

జానకత్తయ్య విషయమంతా రామంకు కూడా తెలుసు. అందువల్ల ఆమెను శంకరం వాళ్లిల్లు చేర్చే ప్రయత్నంలో ఉన్న విషయం అతనికి వివరించాను.

పెద్దగా నవ్వేశాడు రామం అంతా విని.

''అంకిపాడు మిట్ట నుండీ అమ్మచెరువు కట్టకు నీళ్లు దూకినట్లుగా ఆ నవ్వేమిటి?'' అన్నాను విసుగ్గా.

''నవ్వుగాక మరేమిటి? జానకత్తయ్యను శంకరం వాళ్లు ఎలా పెద్దదిక్కుగా స్వీకరిస్తారనుకున్నారు? అంతటి మనిషితనం వాళ్లలో లేదు. ఖచ్చితంగా తీసుకోరు!'' అనేశాడు నిక్కచ్చిగా.

''ఎందుకని?''

''ఎందుకో ఆలోచించు! పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్గా పనిచేస్తున్నావు. ప్రస్తుత మానవ సంబంధాలను గూర్చి ఆ మాత్రం ఆలోచింపలేవా?'' అన్నాడు పరిహాసంగా.

ఎంత ఆలోచించినా నాకు జవాబు లభ్యంకాలేదు.

సుగాత్రికి ఒళ్లు మండినట్లుంది.

''ఈ రామం అన్నయ్య అన్నింటికీ అడ్డుపుల్లలే

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన రచన**

వేస్తారు కానీ, మీరు వెళ్లి శంకరం వాళ్లతో మాట్లాడి రండి!'' అనేసింది రామం ముందే.

''ఆయనకు మంచితనం మీదా, మనుష్యుల మీదా నమ్మకం లేదు. ఆయన్ను మీరు సలహా అడగడం ఏమిటి?'' అంటూ నన్ను కాస్త దులిపింది రామం వెళ్లిపోయాక.

★ ★ ★

ఆ సాయంకాలమే వెళ్లి శంకరం, శారదలను కలిసి జానకత్తయ్యను గూర్చి వివరంగా చెప్పాను.

పాతిక నిముషాల పాటు ఓపికగా నేను వివరించిందంతా విన్నారు ఇద్దరూ.

''వెరీ సారీ రాజారావ్!'' అన్నాడు చివరగా శంకరం.

''ఎందుకు?'' అన్నాను కాస్త ఖంగుతిని.

''ఆల్‌రెడీ ఒక పెద్దామెను మా బంధువులు మాట్లాడేశారు. మేమూ ఓ.కె. చెప్పేశాము. రెండు మూడు రోజులలో వారు మా ఇంటికి వచ్చేస్తున్నారు. మా కోసం మీరు తీసుకున్న శ్రమకు కృతజ్ఞతలు!'' అన్నాడు.

''జానకత్తయ్యది బ్యాడ్ లక్!'' అనుకుంటూ నిరాశగా వెనుదిరిగాను.

★ ★ ★

రెండు మూడు నెలలు గడచిపోయినా శంకరం వాళ్లింటికి ఆ పెద్దామె ఎవరో పెద్దదిక్కుగా రాలేదు. ఆమె రాలేదు కాబట్టి జానకత్తయ్యను పంపమని మమ్మల్ని అడుగుతారేమోనని చూశాము నేనూ, సుగాత్రి కొద్ది రోజులపాటు. అయితే శంకరం వాళ్లు ఆ పనే చెయ్యలేదు. నేనయి నేను మళ్లీ ప్రస్తావించడానికి నా మనసంగీకరించలేదు.

''రామం అన్నయ్య వాస్తవమే చెప్పాడండీ!'' అంది సుగాత్రి ఓ రోజు.

''ఏ విషయం?'' అన్నాను చప్పున అర్థం కాక.

''జానకత్తయ్యను శంకరం వాళ్లు పెద్దదిక్కుగా తీసుకునే విషయం!''

''నిజమే!'' అన్నాను నేను కాస్త ఆలోచించి.

కానీ తను అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగాడో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

ఆ విషయమే రామం కన్పించినప్పుడు ప్రస్తావిస్తే నవ్వేశాడు అందంగా.

''ప్రపంచీకరణ ప్రభావం అనుకో మరో కారణమనుకో మానవ సంబంధాలలో ఎక్కువ భాగం వ్యాపార, ఆర్థిక బంధాలుగా మారిపోతున్నాయి కదా?'' అన్నాడు.

''నాకర్థం కాలేదు!'' అన్నాను నిజాయితీగా.

''నీకర్థం అయ్యేలా చెప్పాలంటే శాంతమ్మగార్ని గూర్చి చెప్పాలి. శాంతమ్మగారు ఇంటి చాకిరీ చెయ్యడానికి తగినంత ఆరోగ్యంగా ఉండిన వారు. ఆమెకు ఉచితంగా తిండిపెట్టాల్సిన అవసరం కూడా లేదు. తమ భర్త తాలూకు పెన్షన్ నెలనెలా ఠంచన్‌గా అందుతుంది. పైగా శంకరాపురంలో ఓ ఇల్లు కూడా ఉంది. శాంతమ్మగారు పోయాక అది కూడా శంకరం పేరిట దఖలుపడింది దాన విక్రయం రాసిచ్చి ఉండడం వల్ల!'' అంటూ నవ్వుతున్నాడు రామం.నా మట్టి బుర్రకు విషయం చాలావరకు బోధపడింది. అనుబంధం, ప్రేమ, పెద్దదిక్కు అనే వాటి నుపయోగించి జీతం భత్తెం లేకుండా పనిచేసే ఓ నమ్మకమైన మనిషిని సంపాదించుకోవడం కూడా ఒక ఆర్ట్ అన్నమాట అనుకున్నాను.

★ ★ ★

రెండ్రోజుల తరువాత శంకరం బజార్లో తారసపడేసరికి మానవ సహజమైన కోపంతో నాకు చిర్రెత్తుకొచ్చింది. అయినా సభ్యత కోసం గబగబా నవ్వు పులుముకుని..


''మీ బంధువులు మాట్లాడిన పెద్దామె వచ్చేశారా?'' అని మామూలుగా ప్రశ్నించాను.

''ఇంకా రాలేదు. ఈ నెలలో వచ్చేస్తారు!'' అన్నాడు.

''మా జానకత్తయ్య కూడా తమ కూతురిల్లు చేరిపోయారు. పోనీ సుగాత్రి బంధువుల తాలూకు పెద్దామె ఆదిలక్ష్మమ్మగారని మరొకరున్నారు. వారికి పిల్లలు లేరు. భర్త డెప్యూటీ తాసీల్దారుగా చేసి పోయారు. పెద్దంతా ఇంట్లో వంటరిగా, అనామకంగా ఘటోద్గజపురంలో ఉంటున్నారు. మీలాంటి వాళ్ల నీడలో అయితే ఆమె నిశ్చింతగా ఉండిపోగలరు నేను వెళ్లి మాట్లాడనా?'' అన్నాను గబగబా.

## అతి సర్వత్ర......

**తారలు ఒకోసారి ఓవరాక్షన్ చేస్తుంటారు. ఈమధ్య కాలంలో వార్తల్లో తారగా వెలుగొందుతోంది నయనతార. శింబుతో ముద్దు ముద్దుగా ఇచ్చిన ముద్దు సీన్ దుమారాన్ని రేపినా ఆమె ప్రవర్తనలో మాత్రం ఎలాంటి మార్పు కన్పించలేదు. ఓ సినిమా షూటింగ్‌కి వచ్చిన శింబు తండ్రితో ఓవర్‌గా ప్రవర్తించింది. ఆయన కాళ్లపై పడి నమస్కరించిందిట. ఇంకేముంది అది కూడా ఆమెకి పబ్లిసిటీ తెచ్చి పెట్టింది. అయితే ఈమె గురించి ఎరిగిన జనం మాత్రం ఇదంతా వట్టి ప్రచారం కోసమే అని ఊరుకున్నారు.**



శంకరం ముఖం విప్పారింది.

''మా బంధువులు మాట్లాడిన ఆవిడ రాకపోతే వెళ్లి చూసొద్దాము!'' అన్నాడు కాస్త మొహమాటంగా.

'వార్నీ!' అనుకున్నాను.

'రామం! యూ ఆర్ ఎ జీనియస్!!' అని కూడా అనుకున్నాను మనసులోనే.

★ ★ ★

శంకరం దంపతులు ఆ మరునాటి సాయంకాలమే మా ఇంటికి వచ్చారు. వాళ్లంత త్వరగా వస్తారని నేననుకోలేదు.

''రాజారావ్! మీరూ, మేమూ కలిసి రేపోసారి ఘటోద్గజపురం వెళ్లి మీ ఆదిలక్ష్మమ్మగారిని ఓసారి చూసి మాట్లాడి వద్దాము!'' అన్నాడు శంకరం.

''ఆదిలక్ష్మమ్మగారెవరండీ?'' అంది సుగాత్రి ఆశ్చర్యంగా అర్థం కాక.

నా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది.